

## రబీకి సమృద్ధిగా సాగునీరు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గోదావరి డెల్టా సిస్టం పరిధిలో ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని రబీ పంట కాలానికి సాగు నీటికి ఎటువంటి ఇబ్బందీ లేదని చీఫ్ ఇంజనీర్, గోదావరి డెల్టా సిస్టం ఆర్.సతీష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నదిలో నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉన్నదని, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో సాగు నీటికి గాని, తాగునీటికి గాని, ఏవిధమైన ఇబ్బందీ లేదని తెలిపారు. ఏ విధమైన ఇబ్బందులైన కలిగితే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరం 9490741146, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, ఏలూరు 9701375830, చీఫ్ ఇంజనీర్, గోదావరి డెల్టా సిస్టం, ధవళేశ్వరం 9652536333లో సంప్రదించాలని తెలిపారు.

# అనుమతుల్లేని ఇటుక బట్టీలు

- కాలుష్యంతో ప్రజల ఇక్కట్లు
- అడ్డగోలుగా విద్యుత్ చౌర్యం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి - సీతానగరం

పెట్టుబడికి మూడింతల లాభాలు గడిస్తున్న ఇటుక బట్టీల వ్యాపారులు. ఎలాంటి పన్నులూ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో గృహ నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇటుక బట్టీల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. బట్టీల ఏర్పాటుపై ఎలాంటి నియంత్రణా లేకపోవడంతో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. రఘుదేవపురం, సింగవరం, కాటవరం, బొబ్బిల్లంక, ఉండేశ్వరపురం ఇలా మండలవ్యాప్తంగా 8 నుంచి 17 ఇటుక బట్టీలను ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క దానికీ అధికారిక అనుమతులు మాత్రం లేవు. బట్టీలు వెదజల్లే కాలుష్యం, బూడిద దుమ్మూ ధూళితో బట్టీల సమీపంలో ఉన్న పంట దిగుబడులపై ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే బట్టీలకు పంచాయతీ తీర్మానం కూడా తప్పని సరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ అధికారి అనుమతులు కూడా తీసుకోవాలి. ఇవేమీ పట్టించుకోకుండానే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చనే ఉద్దేశంతో పోటీ పడి మరికొందరు వ్యాపారులు ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ ప్రాంతం, చెరువులు, కాల్వలకు సమీపంలో బట్టీలను ఏర్పాటు చేస్తూ విలువైన వనరులను కొల్లగొట్టేస్తున్నారు. ఇటుకల తయారీకి అనువైన మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేస్తూ రూ.లక్షల ఆదాయాన్ని వెనకేసుకుంటున్నారు.



రఘుదేవపురంలో రహదారి పక్కనే ఇటుక బట్టీ

**పొగ కాలుష్యంతో రోడ్డు ప్రమాదాలు**

రఘుదేవపురంలో రవిచంద్ర కాలనీ వద్ద నిర్వహిస్తున్న నాలుగు ఇటుక బట్టీల నుండి వెలువడే పొగ కాలుష్యంతో గతంలో రహదారి ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. కాలుష్యంతో రాజమండ్రి నుండి సీతానగరం రహదారిపై ఈ బట్టీల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బట్టీలు రహదారి ప్రక్కన ఉండటమే ప్రధాన కారణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**అధికారుల కనుసన్నల్లోనే..**

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేందుకు నిరంతరంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. కానీ కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటుక బట్టీల వ్యాపారం చేసే యజమానులు విద్యుత్ శాఖ నుంచి ప్రత్యేక అనుమతులు పొందిన తర్వాతనే విద్యుత్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. అలాకాక స్థానికంగా విధులు నిర్వహించే విద్యుత్ శాఖ సిబ్బందికి మామూళ్లతో ఎర వేస్తూ ఉచిత విద్యుత్ దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీంతో విద్యుత్ శాఖ కూడా రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ విద్యుత్ వాడకానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోందన్న విమర్శలున్నాయి.

కొంతమంది రైతులు ఇటుక బట్టీల యజమానులకు సాగు భూములను లీజుకు ఇవ్వడంతో వ్యవసాయ మోటార్ల నుంచే ఇటుక బట్టీలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వలస కూలీలతో నిబంధనలకు విరుద్ధంగా వెట్టిచాకిరీ చేయిస్తున్నా కార్మిక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కొన్ని చోట్ల బాల కార్మికులు కూడా ఇటుక బట్టీల్లో కార్మికులుగా మారి పని చేస్తున్నారు. మండలంలో దాదాపుగా 10 వరకు ఇటుక బట్టీలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా మైనింగ్ శాఖ అనుమతులు తీసుకుంటే రూ.లక్షల్లో ఆదాయం ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంది, కానీ ఏ ఒక్కరు కూడా నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు ధ్రువీకరించిన వారికే అనుమతులు ఇస్తామని, ఇటుక బట్టీల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని చెప్పినా అవన్నీ మాటల్లోనే మిగిలిపోతున్నాయి ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారుల వివరణకు ప్రయత్నం చేయగా వారు స్పందించలేదు.

# కూటమి ఎంపీ అభ్యర్థులు ఎవరు..?

- కాకినాడ బరిలో జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్
- పొత్తులో రాజమహేంద్రవరం కోరుతున్న బిజెపి
- అమలాపురంపై కొనసాగుతున్న ఉత్కంఠ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అన్ని పార్టీలు పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై పూర్తిగా దృష్టి సారించాయి. ఇప్పటికే వైసిపి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కాకినాడ నుంచి చలమలశెట్టి సునీల్, అమలాపురం నుంచి మాజీ ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్, రాజమహేంద్రవరం నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్లను ప్రకటించింది. అయితే కూటమి అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధిష్టానాలు ఇంకా కసరత్తులు చేస్తున్నాయి. కాకినాడ ఎంపీ స్థానానికి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంగళవారం ప్రకటించారు. ఇక అమలాపురం, రాజమహేంద్రవరం అభ్యర్థులపై ఒక అవగాహనకు వచ్చినప్పటికీ అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. టిడిపి, జనసేన, బిజెపి ఆచి తూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

మెజార్టీ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టిడిపి ప్రస్తుతం ఎంపీ అభ్యర్థులపై కసరత్తు చేస్తోంది. మంగళవారం టిడిపి ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారని ప్రచారం జరిగినా మళ్లీ వాయిదా పడింది. రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం నుంచి బిజెపి అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేయనున్నట్లు కూటమి నేతలు చెబుతున్నారు. అయితే అధికారికంగా ప్రకటన మాత్రం విడుదల కాలేదు. వాస్తవానికి ఆమె విశాఖపట్నం నుంచి బరిలో ఉండాలని భావిస్తుండగా కేంద్ర నుంచి పిలుపు వచ్చింది. బుధవారం బిజెపి ముఖ్య నేతలు సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో పురందేశ్వరి కూడా ఢిల్లీలోనే ఉన్నారు. సమావేశం తర్వాత ఆమె రాజమహేంద్రవరం నుంచి బరిలో దిగుతారనే ప్రకటన వెలువడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అమలాపురం ఉమ్మడి అభ్యర్థిగా టిడిపి నేత, లోక్‌సభ ఇన్‌ఛార్జ్ గంటి హరీష్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కీలక స్థానాలను టిడిపి ప్రకటించినప్పటికీ ఇక్కడ అభ్యర్థిని అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. అందుకు అనేక కారణాలున్నాయి. మాజీ ఎంపీ ఎజెవి. బుచ్చిమహేశ్వరావు కుమార్తె డాక్టర్ సత్యశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ యాతాటి రమేష్ బాబు కూడా ఈ స్థానానికి పోటీ పడుతున్న నేపథ్యమే ఈ సిందిగ్ధతకు కారణంగా తెలుస్తోంది. వైసిపిపై పూర్తి వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో రాపాక వరప్రసాద్‌ను ఢీకొట్టే అభ్యర్థిని ఎంపిక చేయాలని టిడిపి భావిస్తుంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా ఆయా సామాజిక వర్గాల ఓట్లను రాబట్టుకునేందుకు కూటమి ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అమలాపురం పార్లమెంటు అభ్యర్థిని ఖరారు చేసిన తర్వాత అమలాపురం, పి.గన్నవరం అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. అభ్యర్థుల ఎంపికపై వైసిపి దూకుడుగా ఉన్నప్పటికీ కూటమి స్థానాల ఖరారుపై ఇంకా స్పష్టత రాకపోవడంతో టిడిపి, జనసేన శ్రేణుల్లో కొంత నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రత్యర్థి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీంతో కూటమి అభ్యర్థులపై త్వరితగతిన స్పష్టత నివ్వాలని టిడిపి, జనసేన శ్రేణులు ఎదురుచూస్తున్నాయి.



కాకినాడ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్‌తో పవన్‌కళ్యాణ్

# సభలో భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-చాగల్లు

ప్రధాన మోడీ పాల్గొన్న ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని టిడిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. చాగల్లులో పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల హరిబాబు స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ల శ్రీరామ్, దొంగ రామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నాతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాదిమంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతమన్నారు. ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని, అవినీతి, దోపిడీలో అధికార వైసిపి నేతలు పోటీ పడ్డారని సభ ద్వారా ప్రధాని స్పష్టం చేశారన్నారు.

# మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మహిళా దళానికి నాయకత్వం వహించిన మల్లు స్వరాజ్యంకు సిపిఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత సిపిఎం సీనియర్ నాయకులు టి.సావిత్రి మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. నాడు నైజాం ప్రభుత్వం నాయకత్వంలో రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాటి నైజాం ప్రభుత్వాన్ని మించిపోయిందన్నారు. ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తూ, మత విద్వేషాలు పెంచుతూ, ప్రాంతాలు కులాల మధ్య చిచ్చులు పెడుతూ, అధికారమే పరమావధిగా దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెడుతుందని విమర్శించారు. బిజెపిని చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు.



స్వరాజ్యానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

# ఎన్నికల అంశాలపై ఆర్‌ఒలకు అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రిటర్నింగ్ అధికారులకు కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. సువిధ, ఎంసిసి, పిఒ, ఎపిఒ, ఒపిఒల శిక్షణ కార్యక్రమం, పోస్టల్ బ్యాలెట్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత, తొలుత ప్రిసైడింగ్ అధికారి, సహయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవడంలో నియామక ప్రక్రియ నుంచి ఓటు హక్కును వినియోగించుకునే వరకు వివిధ దశల్లో చేయాల్సిన విధి విధానాలపై సమగ్ర సమాచారం అందజేశారు.

సువిధ పోర్టల్‌పై పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులు ముందస్తుగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకున్న వాటిని ఆర్‌ఒలు సాధ్యమైనంత తొందరగా సహేతుకమైన విధానంలో అనుమతులు జారీ చేస్తారని చెప్పారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఆన్‌లైన్ నేరుగా దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉందని పేర్కొన్నారు. తాత్కాలిక పార్టీ కార్యాలయాన్ని తెరవడానికి, సభ నిర్వహించడానికి అనుమతి కోసం దరఖాస్తు, లౌడ్ స్పీకర్ లేకుండా సభ నిర్వహించడానికి, లౌడ్ స్పీకర్ ఏర్పాటు చేయడం కోసం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్, లౌడ్ స్పీకర్ కోసం, ఇంటింటికీ ప్రచారం కాన్వాసింగ్ కోసం, కరపత్రాల పంపిణీ కోసం, ఊరేగింపు కోసం అనుమతి కోసం, ర్యాలీ కోసం లౌడ్ స్పీకర్, బ్యానర్, జెండాలను ప్రదర్శించడానికి దరఖాస్తు, ఎయిర్ బెలూన్‌ల కోసం పర్మిషన్ టైప్ అప్లికేషన్‌ని ఎంచుకోవాలన్నారు. హెలికాప్టర్, హెలిప్యాడ్ కోసం, వాహన అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈ సమావేశంలో రాజమండ్రి రూరల్ ఆర్‌ఒ, జెసి ఎన్.తేజ్‌భరత్, అర్బన్ ఆర్‌ఒ, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్‌ఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయం కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ జి.నరసింహులు, రాజానగరం ఆర్‌ఒ, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, గోపాలపురం ఆర్‌ఒ, ఒఎన్‌జిసి ఎస్‌డిసి కెఎల్.శివజ్యోతి, నిడదవోలు ఆర్‌ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి.రమణా నాయక్, అనపర్తి ఆర్‌ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

ఆరోగ్య సురక్ష క్యాంపునకు వచ్చిన ప్రతి పేషెంట్‌కూ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు ఇచ్చి పంపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర రావు సూచించారు. మంగళవారం తాడిపర్రులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. వైద్యాధికారులకు తగు సూచనలిచ్చారు. క్యాంప్‌నకు వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్‌లను రిఫరల్ కేసుల గురించి అడిగి తెలుసు కున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ సేవల కోసం నెట్‌వర్క్ హాస్పిటల్‌కు పంపాలని సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, డాక్టర్ ఆర్.ఉషా దేవి, ఎం.సుబ్రహ్మణ్యం, జె.శ్రీనివాసరావు, నాగమణి, పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి

## వెదురుపాకలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

వెదురుపాకలో మంగళవారం మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం తనయుడు రామ్‌జీ పార్టీనాయకులతో కలిసి గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌జీ మాట్లాడుతూ ప్రతి గడపకూ వెళ్లి సిఎం వైఎస్.జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా, తోట నరసింహంను ఎంఎల్ఎగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు.

## నేటి నుంచి మదనగోపాలుని కల్యాణోత్సవం

ప్రజాశక్తి-తాళ్లపూడి


తాళ్లపూడిలోని జగన్మోహిని మధన గోపాల స్వామి 138వ కల్యాణ మహోత్సవాలను ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. 22వ తేదీ శుక్రవారం సుమారు 8000 మందికి అన్న ప్రసాదం అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టుఉత్సవ కమిటీ చైర్మన్ ప్రముఖ వ్యాపారవేత్త సింహాద్రి జనార్ధనరావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆలయం వద్ద ఆవిష్కరించారు.

## 22న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చాగల్లు

ఎపిఇపిడిసిఎల్ కొవ్వూరు సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 22న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారి సుంకర త్రిమూర్తులు తెలిపారు. విశ్రాంత న్యాయమూర్తి, సిజిఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

**కార్టూ'నిజం'**




దానికి ఆ గ్రూప్ వాళ్లు ఒప్పుకోవడం లేద్సార్..!!

## ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల నియమ నిబంధనలను రాజకీయ పార్టీల అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాలని అన్ని రాజకీయ పార్టీలూ, అభ్యర్థులు సహకరించాలని రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వైవికె.అప్పారావు తెలిపారు. ఈ నెఉల 16కు ముందు ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులు ఉన్న యెడల వాటిని వెంటనే తొలగించాలని, లేనిచో అటువంటి ప్రదర్శన బోర్డులన్నీ తొలగించి, అందుకు అయ్యే ఖర్చు సంబంధిత రాజకీయపార్టీ పేర నమోదు చేస్తామన్నారు. రాజమండ్రి రూరల్లో 24 గంటలూ కాల్ సెంటర్ నెంబర్ 0883-2416005 అందుబాటులో ఉంటుందన్నారు. ఇందుకోసం మూడు షిఫ్టుల్లో సిబ్బంది నియమించామన్నారు. రూరల్ నియోజక పరిధిలో ముందస్తు అనుమతి పొందవలసిన వాటికి సబంధించి రిటర్నింగ్ అధికారి 51-రాజమండ్రి రూరల్, జాయింట్ కలెక్టర్ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

# ఆర్నెల్లు దాటినా అమలు కాని జిఒ

ప్రజాశక్తి-నల్లజర్ల

నూరు శాతం జీతం జిఒ వచ్చి ఆర్నెల్లు దాటినా నేటికీ ఆ జిఒ అమలుకు నోచుకోలేదని ఎపి కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అమలుకు నోచుకోని నూరుశాతం జీతం జిఒకు సంబంధించి పలు విషయాలను మంగళవారం ప్రసాద్ మీడియాకు వివరించారు. వేతనాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం జిల్లా ప్రధాన కార్యాలయాల్లో వినతిపత్రాలను ఇవ్వండని వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ ఇచ్చిన ఆదేశం మేరకు కాంట్రాక్టు ఉద్యోగులు తమ నూరు శాతం గ్రాస్ శాలరీ జిఒ తక్షణం అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కాంట్రాక్టు ఉద్యోగులు వినతులు సమర్పించారన్నారు. గతేడాది సెప్టెంబర్ 14న ఇచ్చిన 100 శాతం జీతం జిఒ అమలుపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సమస్యపై పెద్దఎత్తున కాంట్రాక్టు ఉద్యోగులు ఎంతో ఆవేదనతో వినతులు అందించారన్నారు. ముఖ్యంగా, వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగులు 2018 వరకూ నూరు శాతం గ్రాస్ శాలరీ అందుకునే వారని, అలాంటిది గత ప్రభుత్వం 27 జిఒ తీసుకొచ్చి ఈ ఉద్యోగులను కన్సాలిడేట్ జీతగాళ్లను చేయడంతో తీరని అన్యాయానికి గురయ్యారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ జిఒను రద్దు చేసి మినిమం టైమ్ స్కేలు ఇవ్వడం, తదనంతరం ఆర్నెల్ల క్రితం జిఒ నంబర్ 167 ద్వారా నూరు శాతం గ్రాస్ శాలరీ జిఒ తేవడం కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఎంతో ఆనందం వ్యక్తమయ్యిందన్నారు. తీరా చూస్తే వచ్చిన జిఒ కూడా అమలుకు నోచుకోక కాంట్రాక్టు ఉద్యోగులు తీవ్ర వేదనతో ఉన్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణం నూరుశాతం గ్రాస్ శాలరీ జిఒ అమలు చెయ్యాలని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ కోరారు.

## పరీక్షకు 891 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో మంగళవారం జరిగిన పదో తరగతి హిందీ 891 మంది గైర్హాజరయ్యారని డిఇఒ కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలనాధికారి డి.మధుసూదనరావు ఏడు పరీక్షా కేంద్రాలు, డిఇఒ ఆరు పరీక్షా కేంద్రాలు, తనిఖీ అధికార్లు 52 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 65 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 24,399 విద్యార్థులకు 23,508 మంది పరీక్షకు హాజరయ్యారని డిఇఒ తెలిపారు.

## రెండో రోజు పది పరీక్షలు

ప్రజాశక్తి-తాళ్లపూడి, గోకవరం

పదవ తరగతి రెండవ రోజు పరీక్షలకు తాళ్లపూడి మండలంలో 714 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 72 మంది ఆబ్సెంట్ అయ్యారని ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ తెలిపారు. గోకవరం మండలంలో 810 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఎంఇఒలు బి.గైరమ్మ, ఎం.చిమ్మరాజు దొర తెలిపారు.

# మునికూడలిలో తొలగించని కటౌట్లు

ప్రజాశక్తి - సీతానగరం

ఎన్నికల నేపథ్యంలో ఇసి ఇచ్చిన ఆదేశాలు ఎక్కడా పాటించడం లేదని పలు ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ప్రముఖుల విగ్రహాలను ఇసి ఆదేశాల మేరకు అధికారులు తొలగించడం, ముసుగులు వేయడం చేశారు. ప్రైవేటు స్థలాల్లో ఉన్న విగ్రహాలకు గాని, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు గాని అనుమతి తీసుకోవాలంటే ఇసి ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలి. మునికూడలి రాజంపేట శివారులో ఏర్పాటు చేసిన వైసిపి ఫ్లెక్సీ వివాదాలకు తావిస్తోంది. ప్రవేటు స్థలాల్లో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలంటే ఇసి అనుమతించిన గడువులోగా అనుమతులు తీసుకోవాలి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తీసివేశారని, నాయకుల బొమ్మలపై ముసుగులు వేసారని వారు తెలిపారు. అధికార పార్టీకి చెందిన ఫెక్సీలపై ఒకలాగున ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఫెక్సీలపై ఒకలాగున న్యాయం చేస్తున్నారంటూ కొంతమంది రాజానగరం నియోజకవర్గ ఆర్‌ఒ వద్ద ఫిర్యాదు చేశారు.



మునికూడలి శివారులో తొలగించని ఫ్లెక్సీ

## నేరాలు ఘోరాలు

### పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో ఒక ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న 5 ఏళ్ల బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక చర్యకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బాలికను ఆటోపై రోజూ స్కూలుకు తీసుకెళ్లేవాడు. బాలికపై లైంగిక చర్యకు పాల్పడుతున్నట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ దిశా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

### యువతిని మోసగించిన కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-అమలాపురం

యువతిని మోసగించిన కేసులో నిందితునికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారని ఎస్‌పి శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఎస్‌పి శ్రీధర్, అమలాపురం టౌన్ సిఐ కె.క్రిస్టోఫర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం మండలం పేరూరుకు చెందిన ఒక యువతని వన్నెచింతలపూడికి చెందిన పరమట వెంకటేశ్వర దొరబాబు ప్రేమపేరుతో నమ్మించాడు. సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో కట్నం ఆశించి, మరో యువతితో పెళ్లికి సిద్ధపడ్డాడు. దీనిపై బాధితురాలు 2019 జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు పరమట వెంకటేశ్వర దొరబాబు, అతని కుటుంబ సభ్యులపై అప్పటి సిఐ సిహెచ్.శ్రీరామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి నిందితుని అరెస్ట్ చేసి రిమాండుకు పంపంపారు. తగిన ఆధారాలతో కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వై.బెన్నయ్య నాయుడు నిందితునికి 7 ఏళ్లజైలు, రూ.5వేల జరిమాని విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

### ఐదు మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలీ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ ఎస్.శ్రీనివాసు మంగళవారం సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఇందుకూరి కృష్ణంరాజును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.765 విలువ చేసే 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం యర్రపోతవరంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ జానీ బాషా తెలిపారు. యర్రపోతవరం శివారు ఖాళీస్థలం వద్ద అదే గ్రామానికి చెందిన దండుప్రోలు ఈశ్వరరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. అతన్ని అరెస్టు చేసి, 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు కొమ్మాయిచెరువు గ్రామంలో విద్యుదాఘాతానికి గురై పెద్దింశెట్టి ధనరాజు(30) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ధనరాజు వడ్రంగి పనిచేస్తూ జీవిస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం తన పనిముట్లకు విద్యుత్ కనెక్షన్లను ఇస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజానగరం

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నరేంద్రపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను(45) సైకిల్‌పై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల అప్పు చేసి వరికోత మిషన్‌ను కొనుగోలు చేశాడు. దాన్ని అద్దెకు ఇస్తుండేవాడు. వాయిదాలు కట్టలేక అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సిఐ కాశీ విశ్వనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల 16వ నెంబరు జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు రోడ్డుపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు బాధితులు కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన వారిగా గుర్తించారు. మద్యం మత్తులో అధిక స్పీడుతో వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

### యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిలంక గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై సోమవారం సీతానగరం పోలీస్ స్టేషన్లో ఆమె తల్లి ఫిర్యాదు చేసింది.. బొబ్బిలంకకు చెందిన బాలిక రాజమహేంద్రవరంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాస్తుంది. చివరిరోజు పరీక్ష నిమిత్తం రాజమండ్రి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై తల్లి మరియమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

### 3 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడు తెల్లగడ్డ శివారులో తొర్రేడు, బుచ్చెంపేట గ్రామాల్లో సారా బట్టీలపై సీతానగరం ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి 3వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 110 లీటర్ల నాటుసారా, 50 కేజీల బెల్లం 50 కేజీల అమోనియా బస్తా, పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సారా అమ్మకాలు సాగించినా, రవాణా చేసినా, తయారుచేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

## వివక్షపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

### న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ప్రత్యూషకుమారి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఖైదీల కుంటుంబాల వారు వివక్షకు గురైన తమ దృష్టికి తీసుకురావాలని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూషకుమారి తెలిపారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఖైదీల కుటుంబ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్తి వివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు, ఇతర న్యాయ సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందక పోయినా సంస్థ సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా పిల్లల విద్యాభ్యాసం ఆగిపోవడం, సమాజంలో ఖైదీల కుటుంబ సభ్యుల పట్ల వారి పిల్లల పట్ల వివక్ష చూపడం లాంటి ఇబ్బందులు ఎవరికైనా ఎదురయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖైదీలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. స్థానిక ఒఎన్‌జిసిలోని గోదావరి గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ వివిధ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొని హక్కులను పరిరక్షించుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలని మహిళలకు సూచించారు. ఇబ్బందులకు భయపడి తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని వివరించారు.


సదస్సులో మాట్లాడుతున్న కె.ప్రత్యూషకుమారి

## ముందస్తు శిక్షణకు కార్యాచరణ పూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలీసు సిబ్బందికి ముందస్తుగా శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణను రూపొందించామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి నుంచీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా ఎన్నికల అధికారులతో ప్రకటనలు, స్టాటిక్ సర్వైలెన్స్ బందాలు, ఈవిఎమ్ రాండమైజేషన్ , ప్రతికూల వార్తలు, పిఒ, ఎపిఒ శిక్షణ, తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. శిక్షణలో భాగంగా రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశనం చేశామన్నారు. ఇవిఎంలకు చెందిన మార్గదర్శకాలు జారీ చేస్తూ, జిల్లాలో ఇవిఎం మొదటి ర్యాండమైజేషన్ మార్చి 28న, పోలింగ్ పర్సన్ ర్యాండమైజేషన్ - డ్రై రన్, మొదటి శిక్షణ పిఒ, ఎపిఒ, ఒపిఒలకు ఏప్రిల్ 4న నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రచారం, ప్రకటనలపై ప్రధాన ఎన్నికల అధికారి చేసిన సూచనలపై ఆర్ఒలకు సూచనలు, క్షేత్ర స్థాయిలో చేపట్టవలసిన వాటిపై జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ స్థలాలు, సంస్థలపై హోర్డింగ్‌లు, ప్రకటనలు నిషిద్ధమన్నారు. వ్యాపార ప్రకటనలు తప్ప రాజకీయ ప్రచారం కోసం వినియోగిస్తే ఉత్తర్వుల ఉల్లంఘనగా పరిగణించాలని స్పష్టం చేశారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాలపై ఎటువంటి రాజకీయ పార్టీల ఫోటోలు, స్లొగన్స్ ఉండరాదని, అటువంటి వాటి విషయంలో రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక రుణ ప్రణాళిక రూ.13.20 కోట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

2024-25 ఆర్థిక సంవత్సరం క్రెడిట్ ప్లాన్‌ను మంగళవారం కలెక్టర్ మాధవీలత విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆయా ప్రాధాన్యత, తదితర రంగాల్లో అవకాశాల మేరకు అనుబంధ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ సిద్ధం చేసి బ్యాంకర్లకు అందజేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకర్స్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రుణాలను విరివిగా అందించాలని కలెక్టర్ డాక్టర్. కె.మాధవీలత కోరారు. ఈ సందర్భంగా జిల్లా బ్యాంకు సమాఖ్య సమావేశంలో నాబార్డ్ జిల్లా అధికారి డాక్టర్. వైఎస్.నాయుడు వివరాలు వెల్లడించారు. వివిధ బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్య సాధన వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం డివి.ప్రసాద్, నాబార్డ్ డిడిఎం డాక్టర్ వైఎస్.నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి బి. సుజాత కుమారి, డిసిసిబి, సిజిజి బ్యాంక్, ఇతర బ్యాంకుల ప్రతినిధులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న కలెక్టర్

## ఆర్ట్స్ కళాశాలకు రూ.50 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలకు హన్నా సొల్యూషన్స్ చైర్మన్ రాంప్రసాద్ ఇంకుబేషన్ హబ్ ఏర్పాటు కోసం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. కళాశాలలో 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఒక భవనాన్ని నిర్మించి దానిని నైపుణ్య సామర్థ్య శిక్షణకు అంకురార్పణ చేశారు. ఎన్ఎఎసి, ఎన్ఐఆర్ఎఫ్, నూతన జాతీయ విద్యావిధానం ఆదేశాల మేరకు ఉన్నత విద్యా శాఖల్లో ఇంకుబేషన్ సెంటర్లను నిర్మించాలి. ఈ ఉత్తర్వుల అనుసారం కళాశాలలో ఇంకుబేషన్ రూపకల్పన చేశారు. దీని ద్వారా విద్యార్థులకు సేఫ్టీ నాప్కిన్స్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, ఐటీ ఉద్యోగాలను పొందుటకు శిక్షణ, ఉద్యానవన పంటలు, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యాటక రంగం గురించి శిక్షణ ఇవ్వనున్నారుర. ఆర్టిఫిషియల్ జ్యూవెయలరీ తయారీలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ప్రతి సంవత్సరం రెండు వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. సిఒడబ్ల్యూఇ సౌజన్యంతో శిక్షణ ఇస్తామని జాతీయ అధ్యక్షురాలు లలిత, రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి, స్థానిక అధ్యక్షురాలు రాధిక తెలిపారు. ఈ శిక్షణ విధానం గురించి వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడారు. దాతల వల్ల కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీశైల శాస్త్రి పాల్గొన్నారు.


శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులు

## శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి -తాళ్లపూడి

ఆరుగాలం పంటలు పండించే రైతులు శాస్త్రవేత్తల సూచనలతో ఆధునిక సాంకేతిక పద్ధతులతో సాగు చేస్తే చీడల బాధ లేకుండా అధిక దిగుబడులతో ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏరువాక కేంద్రం డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో మంగళవారం నియోజకవర్గంలోని తాళ్లపూడి, కొవ్వూరు మండలాలకు చెందిన పలు గ్రామాల పరిధిలో దాళ్వా వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ చంద్రశేఖర్ మాట్లాడుతూ పంటల విషయంలో రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటపై అక్కడక్కడా కాగితపు పురుగు ఆశించడం తప్ప వేరే చీడపీడలు ఏమీ లేవని పంట ఆరోగ్యకరంగా ఉందని చెప్పారు. మొక్కజొన్న విత్తన ఉత్పత్తి సంతృప్తికరంగా ఉందని అంటూ నానో యూరియా వాడకంపై మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పరిశోధనలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి ఎఒ రుచిత, కొవ్వూరు ఎఒ గంగాధర్ రైతులు తదితరులు ఉన్నారు.


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

## కాకరపర్రులో ఆరోగ్య సురక్ష క్యాంప్

ప్రజాశక్తి -పెరవలి

మండలంలోని కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాకరపర్రు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరరావు సందర్శించారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ వారికి చేసే పరీక్షలు, ప్రస్తుతం ఇస్తున్న మందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పి.తేజశ్రీ, డాక్టర్ కె.హేమరాజులను వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జిఎస్ఎల్ ఆసుపత్రి జనరల్ వైద్యులు డాక్టర్ జి.తేజ్ కిరణ్ హాజరైన రోగులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ బి.విజయలక్ష్మి, కెవి.నాగేశ్వరరావు, కాకరపర్రు ఎంఎల్‌హెచ్‌పి జి.అంజలి, ఎఎన్ఎం కె.చిన్నారి, హెల్త్ అసిస్టెంట్ వి.రాజశేఖర్, ఎంఎల్‌పి హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సిఎం జగన్‌తో గురుదత్త ప్రసాద్

### గురుదత్త ప్రసాద్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎడ్వైజర్‌గా నియమితులైన మేడా గురుదత్త ప్రసాద్‌కు పలువురు అభినందించారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత గురుదత్ ప్రసాద్ జనసేన పార్టీలో రాజానగరం నియోజకవర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆ పార్టీని వీడి వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా గురుదత్త ప్రసాద్‌ను కలిసి జక్కంపూడి రాజా ఆయనకు అభినందనలు తెలిపారు. వైసిపిలో చేరగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గుర్తించి, సముచిత స్థానం కల్పించారని రాజా అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గురుదత్త ప్రసాద్ సేవలను వినియోగించుకుంటామన్నారు.

## యానాం వార్తలు

### పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా రాధాకృష్ణన్

ఝార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకష్ణన్‌కు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకూ పుదుచ్చేరి ఎల్‌జిగా, అలాగే తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన తమిళ సై రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించింది. దీంతో కేంద్రం ఝార్ఖండ్ గవర్నర్ రాధాకష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి ఎల్‌జిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.




### రీజన్సీలో ఎన్ఎస్ఎస్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

రీజన్సీ జూని యర్ కళాశాలలో వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభ మైంది. ఎన్ఎస్ఎస్ యా నాం రీజియన్ కో-ఆర్డి నేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, కళాశాల ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ క్యాంపు ఆవశ్యకతను వివరించారు. ఈ శిబిరంలో 50 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

## శిశువు మృతితో ఆందోళన

### డాక్టర్ నిర్లక్ష్యమే అంటున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- రాజోలు

శిశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రాజోలు ఆసుపత్రి వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే చనిపోయిందంటూ ఆరోపించారు. వైద్యులు, బాధితుల వివరాలమ మేరకు... సఖినేటిపల్లి మండలం అంతర్వేది పాలేనికి చెందిన కుడుపూడిరాజేశ్వరి ఐదురోజుల క్రితం ప్రసవం కోసం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. అప్పటి నుంచి వైద్యుఉ ఇంజక్షన్లు ఇస్తూ పర్యవేక్షణలో ఉంచారు. మంగళవారం ఉదయం పరిస్థితి విషమంగా ఉందని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పడంతో ఆందోళన చెందిన బంధువులు డాక్టర్‌ను నిలదీశారు. గర్భంలోనే శిశువు మరణించిందని, తల్లికి కూడా ప్రమాదం ఉందని చెప్పడంతో ఆందోళన చెందారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ కలిసి మాట్లాడారు. గర్భిణికి వెంటనే ఆపరేషన్ చేయాలని వైద్యురాలని ఆదేశించారని తెలిపారు. దీనికి ఆమె నిరాకరించిందన్నారు. దీంతో వారు ప్రయివేటు ఆసుపత్రిని ఆశ్రయించారు.. కుటుంబ సభ్యులు వారి బంధువులు వైద్యురాలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యకంచేశారు. వైద్యురాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. దీనిపై సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ వివరణ కోరగా ఈనెల 14న కుడుపూడి రాజేశ్వరి ఆసుపత్రిలో చేరిందన్నారు. రాజేశ్వరికి ముందుగా ఆపరేషన్ జరిగిందని.. నొప్పులు తగ్గించడానికి ఇంజక్షన్‌ను వైద్యురాలు ఇచ్చిందన్నారు. అబ్జర్వేషన్ లో ఉంచి చికిత్స అందించారన్నారు. మంగళవారం ఉదయం బేబీ హార్ట్ బీట్ లేదన్నారు. దీంతో స్కానింగ్ తీసి చూడగా బేబీ మృతి చెందినట్టు వైద్యురాలు తెలిపారన్నారు.. వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేశామన్నారు.

## చాగల్లులో ముప్పిడి వెంకటేశ్వరావు పర్యటన

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని గౌరిపల్లి, చంద్రవరం, మల్లవరం, మార్కొండపాడు గ్రామాల్లో మంగళవారం టిడిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యటించారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను కలిసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అందరు కలిసి సమిష్టిగా కృషి కూటమికి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టూ మెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారావు చౌదరి, కంఠమని రామకృష్ణ టిడిపి నాయకులు నాదెళ్ల శ్రీరామ్, కేతా సాహెబ్, గద్దే వీర్రాజు, తాళ్లూరి రామకృష్ణ, రత్నాజీ, ఉప్పులూరి శ్రీనివాస్, తాళ్లూరి నాగేంద్ర చౌదరి, మద్దూకూరి రమేష్, కుందుల సుబ్బారాయుడు, గద్దే పవన్, కుందుల కృష్ణ, సుంకవల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

### పాలెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం గ్రామ శివారు చైతన్య నగర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం డాక్టర్ ఎస్.నాగసాయి మౌర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 263 మంది పేషెంట్లకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 22 మంది చిన్న పిల్లలు ఈ శిబిరంలో సేవలు పొందారు. 33 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫర్ చేశారు. కడియం ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. డాక్టర్ ఎం.మణి జ్యోత్స్న, ఆర్థోపిడీషియన్ డాక్టర్ ఎ.గౌతమ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.స్నేహ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ వి.సత్యప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### జనసేన పార్టీలో పలువురి చేరిక

ప్రజాశక్తి-తాళ్లపూడి

వైసిపికి చెందిన పలువురు యువకులు మంగళవారం జనసేన పార్టీలోకి చేరారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గంటా కృష్ణ, అయితం మణికంఠ ఆధ్వర్యంలో జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి గాయత్రి వెంకటేశ్వరరావు సమక్షంలో యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### గ్రామపంచాయతీ కార్యాలయం, సాకుర్రు

**టెండరు ప్రకటన**

రి.క. నెం.07/2024 తేది.16-03-2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, సాకుర్రు గ్రామపంచాయతి 2024-2025 సంవత్సరమునకు అవసరమగు ఈ దిగువ చూపిన ఐటెం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 28-03-2024వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00 లకు వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో మధ్యాహ్నం గం॥ 12.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | ధరావత్తు (రూ) |
|---|---|---|
| 1 | 2024-2025 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు | రూ. 500/- |
| 2 | 2024-2025 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు | రూ. 500/- |
| 3 | 2024-2025 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు | రూ. 500/- |

సం/- గుత్తుల చిరంజీవిరావు
సర్పంచ్, సాకుర్రు గ్రామపంచాయితీ

సం/- వి.రమా శైలజ
పంచాయితీ కార్యదర్శి, సాకుర్రు గ్రామపంచాయతి

గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి బిల్లులను వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి ISI మార్కు కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

### మహారాజశ్రీ విశాఖపట్టణం 4వ అదనపు జిల్లా జడ్జివారికోర్టులో

**A.S. 50 / 2016**

**Between:**
Konagalla Suryanarayan etc ... Appellant
**And:**
Konagalla Satyanarayana etc ... Respondents
**R-3:** Sri Konagalla Satya Balaji S/o. Late Sanyasi Setti, Hindu, aged 42 years, D.No.2-48 Ramalayam Veedhi, Thondangi, Gopalapatnam, East Godavari District - 533406

యిందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు అప్పీలులో మీ హాజరు నిమిత్తం **తే:25-3-2024దీన** వాయిదా అయివున్నది. కావున పై తేదీన, పై కోర్టులో మీ స్వయంగా గాని, మీ అడ్వకేటు ద్వారా గాని **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు కావలసినదిగా తెలియజేయడం అయినది. మీరు హాజరు కాని యెడల పై నెంబరు అప్పీలు మీ వరోక్షంలో తీర్మాణించబడునని తెలియజేయడం అయినది.

**A.V.S.BHAVANI PRASAD**
Advocate, D.No. 1-2-5, Gandhinagaram, Anakapalle
Cell : 99893 28366
Anakapalli, Dt.19-3-2024

### మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

**O.S. No. 563/2023**

*Between:*
Tangeti Venkateswara Rao ***...Plaintiff***
AND
*D-1:* Yarra Siva Kumar, S/o. late Bhaskara Rao, Hindu, aged 40 years, D.No. 1-88, Chakalipeta, Hukumpeta, Rajamahendravaram Rural Mandal, E.G.Dt.,
*D-2:* Yarra Pushpalatha, W/o. Siva Kumar, Hindu, aged 35 years, House wife, D.No. 1-88, Chakalipeta, Hukumpeta, Rajamahendravaram Rural Mandal, E.G.Dt.,
*D-3:* Yarra Satya Durga, W/o. Ramakrishna, Hindu, aged 35 years, House wife, D.No. 1-88, Chakalipeta, Hukumpeta, Rajamahendravaram Rural Mandal, E.G.Dt.,
*D-4:* Yarra Tejaswini, W/o. Bhanu Prasad, Hindu, aged 28 years, House wife, D.No. 1-88, Chakalipeta, Hukumpeta, Rajamahendravaram Rural Mandal, E.G.Dt.,
***...1, 2, 3, 4 Defendants***

పై నెంబరు దావాలో 1, 2, 3, 4 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 11-4-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

**జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
**జి.వి.రామలక్ష్మి**
అడ్వకేట్స్, రాజమండ్రి
రాజమండ్రి
16-3-2024

### పాస్‌పోర్టు పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అంబాజీపేట మండలం, పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన బీర సరస్వతి, భర్త: బీర గోపాలకృష్ణ పాస్‌పోర్టు పడిపోయినది. **పాస్‌పోర్టు నెంబర్ K5112741,** ది. 07-03-2024వ తేదీన అంబాజీపేట మండలం పసుపల్లి మా అల్లుడు ఇంటి దగ్గర నుంచి అయినవిల్లి మండలం మడుపల్లి గ్రామం జిరాక్స్ సెంటర్‌కు వెళ్లగా మడుపల్లిలో నా బ్యాగ్ పోగొట్టుకున్నాను. దానిలో విలువైన నా పాస్‌పోర్టు ఉంది. దొరికినవారు ఈక్రింద అడ్రస్‌కు అందజేయగలరు.

**బీర సరస్వతి, భర్త: గోపాలకృష్ణ**
**పుల్లేటికుర్రు గ్రామం, రాజేశ్వరి కాలనీ,**
**అంబాజీపేట మండలం,**
**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా**
**సెల్: 8523080569**

### ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, జి.మూలపొలం గ్రామానికి చెందిన మెల్లం సింహాచలం, S/o. మునియ్య అను నా హక్కు విడుదల పత్రం రి.జ.నెం. 722/2003 వ్యవసాయ భూముల ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ కాపీలు తీసుకునే నిమిత్తం ది. 08-03-2024వ తేదీన జి.మూలపొలం గ్రామం నుండి మురమళ్ళ వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దస్తావేజు నెంబరు 484/1 (ఎకరం నాలుగు సెంట్లు) అని ఈ ప్రకటన ద్వారా తెలియపరచుచున్నాను. దొరికినవారు ఈ చిరునామాకు అందజేసిన యెడల తగిన పారితోషకం ఇవ్వబడును.

**ఇట్లు: మెల్లం సింహాచలం,**
**S/o. మునియ్య, డోర్ నెం. 3-88,**
**జి.మూలపాలం గ్రామం, ఐ.పోలవరం మండలం**
**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా**
**సెల్: 9866946045**

### మహారాజశ్రీ పెద్దాపురం 7వ జిల్లా కోర్టు, పెద్దాపురం

**I.A. 34/2017 in I.A. 1470/2016 in O.S. 114/2016**

*బిట్వీన్:*
1. తాడి సత్తిరెడ్డి
2. వీరమళ్ల సుబ్బారావు
3. ద్వారంపూడి వెంకట ధనలక్ష్మి
4. ఇనపర్తి వెంకటరత్నం

-క్లయిమ్ పిటీషనర్స్

మరియు

1. శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానము, ఎ.అన్నవరము, రిప్రజెంటెడ్ బై ఇట్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు.
2. ద్వారపురెడ్డి రామకృష్ణ
3. అనిసెట్టి నారాయణరెడ్డి -రెస్పాండెంట్స్

**R2:** ద్వారపురెడ్డి రామకృష్ణ, S/o. లేటు గోవిందు, వయస్సు 40 సం॥లు, వ్యాపారము, బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం దగ్గర, సాయిబాబా గుడి, ఎ.అన్నవరము.

పై నంబరు గ్రంధమునందు మీకు ఎన్నిమార్లు నోటీసు పంపినప్పటికీ మరియు పోస్టల్ ఆర్.పి.లను తీసుకొనకుండా ఉద్దేశపూర్వకముగా త్రిప్పివేయు చున్నారు. కావున సదరు పై నంబరు I.A. 34/2017 **26-3-2024 న వాయిదా అయివున్నది. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉంటే తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షంగా కోర్టు వారు పిటిషన్ తీర్మానించెదరు అని తెలియజేయడం అయినది.

*(By Order)*
**G.SATYANARAYANA**
Advocate, Peddapuram